వైభవంగా మహాలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు



అల్వాల్: మహాలక్ష్మి ఆలయ నాల్గవ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యావాచనము, లక్ష్మీగణపతి హవనము తదితరు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూర్యప్రకాష్‌రెడ్డి, సుధాకర్, సుబ్రహ్మణ్యం, అర్జున్‌రావు, మనోజ్, మాథూర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకంలో పాల్గొన్న రెడ్డి సంఘం ప్రతినిధులు

మల్లాపూర్: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు కేబినేట్ ఆమోదన తెలిపిన సందర్భంగా మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ చౌరస్తాలో రెడ్డి సంఘం అధ్యక్షుడు దోమ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు హర్షనీయమన్నారు. కోదండ ధర్మారెడ్డి, పద్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి, రాంరెడ్డి, రాజిరెడ్డి, సోమిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌ను అభివృద్ధి చేస్తాం



28వ డివిజన్‌లో పర్యటిస్తున్న కమిషనర్, కార్పొరేటర్

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్‌లో గురువారం కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్ కారింగుల నిహారిక గౌడ్ సమక్షంలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఎస్‌డీఎఫ్ గ్రాంట్ కింద మంజూరైన రూ.39 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. డీఈఈ మాధవాచారి, ఏఈ రాజశేఖర్, కాలనీవాసులు నరేందర్ యాదవ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

థీమ్‌పార్క్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్

మల్లాపూర్: త్వరితగతిన థీమ్‌పార్క్ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. మల్లాపూర్‌లో దాదాపు రూ.4 కోట్లతో చేపట్టిన థీమ్‌పార్కు పనులను కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక హంగులతో మల్లాపూర్‌లో థీమ్‌పార్క్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. అదేవిధంగా పార్క్ స్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు శేఖర్, లోకేశ్, శ్రవణి, డీఈ రూప, ఏఈ సవంత్రి, జలమండలి డీజీఎం సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



పరమేశ్వర్‌రెడ్డిని కలిసిన హెచ్‌బీకాలనీ నాయకులు

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ అభివృద్ధికి రూ.60 లక్షల నిధులు మంజూరు కావడంపై కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకి సంబంధించిన ప్రొసీడింగ్స్ అందజేసిన కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇన్‌చార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డిని గురువారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. రూ.60 లక్షలతో కైలాసగిరి, ఇందిరానగర్, లక్ష్మీనగర్, రాజీవ్‌నగర్, నవోదయనగర్, డైమండ్‌హిల్స్ కాలనీల్లో రోడ్ల నిర్మాణాలతో పాటుగా మౌలిక వసతుల కల్పన కోసం పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. అలాగే డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యేలా కృషి చేయాలని పరమేశ్వర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జలగం వెంకటేశ్, గుర్రాల సంతోష్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

అల్వాల్: బాల్య వివాహాలను అరికట్టాలని కార్పొరేటర్ సబిత అనిల్‌కిషోర్ అన్నారు. ఆశ్రిత, కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్‌లో కార్పొరేటర్ సబిత గురువారం పాల్గొన్నారు. డివిజన్ పరిధిలో బాల్య వివాహాల నివారణ, విద్యకు భరోసా కల్పించేందుకు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి రిమాండ్



నిందితుడు రామకృష్ణ

మల్లాపూర్: ఇళ్లలో చోరీలు చేస్తూ తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని గురువారం నాచారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. తమిళనాడుకు చెందిన రామకృష్ణ బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి జవహర్‌నగర్ బాలాజీనగర్ కాలనీలో నివసిస్తున్నాడు. ఈజీగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనాలు చేస్తున్నాడు. ఈక్రమంలో వాహనాల తనిఖీల్లో రామకృష్ణ పట్టుబడి.. చోరీలు చేసినట్టు ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద రూ.1.40 లక్షలతో పాటు తులం బంగారం స్వాధీనం చేసుకున్నారు.

బీజేపీతోనే బలహీన వర్గాలకు భద్రత

మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

రామంతాపూర్: దేశంలోని బడుగు, బలహీన వర్గాలకు సామాజిక, ఆర్థిక భద్రత ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికే సాధ్యమని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లో బీజేపీ సీనియర్ నేత గడ్డం సాయికిరణ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కాలనీ సంఘాలు, కుల సంఘాల ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. ప్రధాని మోదీ సబ్‌కా వికాస్ సబ్కే సాత్ అనే నినాదం ఇవ్వడమే కాకుండా ఆచరించి చూపిన నాయకుడు అన్నారు. కరోనా సమయంలో దేశ ప్రజలకు ధైర్యాన్నిచ్చి ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన ఘనత ప్రధానికే సాధ్యమైందన్నారు. గతంలో మల్కాజిగిరి ఎంపీలుగా గెలిచిన వారు నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని.. తనని గెలిపిస్తే అందరికి అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని ఈటల స్పష్టం చేశారు. నేడు జరగనున్న మల్కాజిగిరిలో ప్రధానమంత్రి రోడ్ షోకు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకురాలు బొడిగే శోభ, కార్పొరేటర్లు కక్కిరేణి చేతన, బండారు శ్రీవాణితో పాటు ఉప్పల్ కన్వీనర్ దేవసాని బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

పోటీకి అభ్యర్థులు కరువు..

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు అభ్యర్థులే కరువయ్యారని, బీజేపీ 12 స్థానాలకు పైగా గెలుపొందడం ఖాయమని ఈటల రాజేందర్ తెలిపారు. ఈసారి ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రలోభాలకు ప్రజలు లొంగే అవకాశమే లేదని చెప్పారు.

మోదీ రోడ్‌షోకు పెద్ద ఎత్తున తరలిరండి

మల్కాజిగిరి: నేడు మల్కాజిగిరిలో జరిగే ప్రధాన మంత్రి మోదీ రోడ్‌షో విజయవంతం చేసేందుకు ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి సాయంత్రం 4 గంటలకు మీర్జాలగూడ నుంచి మల్కాజిగిరి వరకు రోడ్‌షో జరుగుతుందన్నారు. సుమారు 2 లక్షల మంది పాల్గొంటారని అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పార్టీలకు అతీతంగా నాయకులే కాకుండా ప్రజలు కూడా మోదీకి స్వాగతం పలకడానికి ఉత్సాహంగా ఉన్నారన్నారు. దేశం సురక్షితంగా ఉండాలంటే మోదీ ప్రధానిగా ఉంటేనే సాధ్యమవుతుందని చెప్పారు. సురక్షిత వాతావరణం ఉండాలన్నా, సంస్కృతి సంప్రదాయాలు దేశంలో కొనసాగాలన్నా బీజేపీతో అధికారంలో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. కార్పొరేటర్లు శ్రవణ్, సునీతా యాదవ్, వెంకటేశ్వర్లు, ఓఎస్‌రెడ్డి, ఆర్‌కె శ్రీనివాస్, వీకే మహేశ్, గణేశ్, బాలలింగం పాల్గొన్నారు.

శ్వేత కుటుంబానికి పరామర్శ

కాప్రా: ఇటీవల ఆస్ట్రేలియాలో హత్యకు గురైన శ్వేత మాదగాని కుటుంబాన్ని గురువారం మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పరామర్శించారు. నియోజకవర్గ పర్యటనలో ఉన్న ఈటల.. విషయం తెలుసుకుని ఏఎస్‌రావునగర్ డివిజన్ బృందావన్ కాలనీలో ఉంటున్న శ్వేత తల్లిదండ్రుల ఇంటికి చేరుకున్నారు. ఆమె తండ్రి బాల్‌శెట్టితో మాట్లాడి ఓదార్చారు. శ్వేత మృతదేహం త్వరగా భారత్‌కు తీసుకొచ్చేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడతానని ఈటల చెప్పారు.

రండి.. కలిసి పనిచేద్దాం

కాప్రా: గతంలో బీజేపీని వీడి ఇతర పార్టీల్లోకి వెళ్లిన నాయకులను తిరిగి పార్టీలోకి తీసుకొచ్చేందుకు సీనియర్లు, ఈటల రాజేందర్ దృష్టి సారించారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలుపే లక్ష్యంగా ప్రచారాన్ని ముమ్మరం చేసిన ఈటల పార్టీని వీడిన నేతలను ఒక్కొక్కరిగా కలుస్తున్నారు. ఇందులో భాగంగానే గతంలో బీజేపీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన ఏఎస్‌రావునగర్ డివిజన్‌కు చెందిన ఏనుగు సీతారాంరెడ్డిని కలిశారు ఈటల రాజేందర్. ఉదయం సఫిల్‌గూడలో మార్నింగ్ వాకర్స్‌తో ముచ్చటించిన అనంతరం మధ్యాహ్నం ఏఎస్‌రావునగర్‌లోని సీతారాంరెడ్డి నివాసానికి చేరుకున్నారు. వివిధ కారణాలతో పార్టీని వీడినా ప్రస్తుతం కలిసి పని చేయాల్సిన సమయం వచ్చిందని పార్టీలోకి సీతారాంరెడ్డిని ఆహ్వానించారు. ఈటల ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన సీతారాంరెడ్డి త్వరలోనే బీఆర్‌ఎస్‌ను వీడి సొంతగూటికి చేరుతారని సమాచారం. అనంతరం చర్లపల్లి డివిజన్‌కు చెందిన మరికొంత మంది బీఆర్‌ఎస్ నేతలను కూడా ఈటల కలిశారు. కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, పార్టీ నేతలు మర్రి మోహన్‌రెడ్డి, ఏఎస్‌రావునగర్ డివిజన్ ప్రెసిడెంట్ రమేశ్ యాదవ్, నాయకులు నాగరాజు, సందీప్, సోమేశ్వర్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలని వినతి



దాన కిషోర్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే

అల్వాల్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గురువారం డాక్టర్ అంబేడ్కర్ సచివాలయంలో అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో ఆర్‌యూబీ, ఆర్‌ఓబీ పనులతో పాటు గౌతంనగర్‌లో తాగునీరు రిజర్వాయర్లను త్వరితగతిన పూర్తి చేయాలని వినతిపత్రంలో కోరామన్నారు. ఇందుకు ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్, మాజీ కార్పొరేటర్ ఆకుల నర్సింగ్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు రావుల అంజయ్య, రాము యాదవ్, రమేశ్, పరమేశ్, ఇబ్రహీం, రాజు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయానికి విరాళం అందజేత



ఆలయ కమిటీకి నగదు అందజేస్తున్న సుమంత్‌రెడ్డి

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ రామ్‌రెడ్డినగర్‌లోని పోచమ్మ ఆలయానికి గురువారం మాజీ ఎమ్మెల్యే బేతి సుభాశ్‌రెడ్డి కుమారుడు సుమంత్‌రెడ్డి రూ.68,400లు విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయసహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో బత్తుల నాగరాజు యాదవ్, నందికంటి శివ, కోకల సత్యనారాయణ, శాంతికుమార్, పుట్ట మల్లేశ్, ఇరుపాటి మహేశ్, పుట్ట గణేశ్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్

మేడిపల్లి: పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి విద్యార్థులకు ఉద్బోధించారు. పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం మేయర్, కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి చేతుల మీదుగా హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పరీక్షల్లో ఉత్తమ గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధిస్తే ఉన్నత విద్యకు మంచి అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు గతంలో కంటే ప్రస్తుతం ఎంతో మెరుగ్గా ఉన్నాయని, ఉత్తమ విద్య ప్రమాణాలతో మేడిపల్లి ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా రాణిస్తోందన్నారు. చదువుపై ఆసక్తిగల పేద, మధ్య తరగతి విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని మేయర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కె.శుభాష్ నాయక్, ఎంపాల అనంతరెడ్డి, మధుసూదన్ రెడ్డి, నాయకులు భండారి రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'కల్లుగీత సంఘం' అధ్యక్షుడిగా పనగట్ల



కుషాయిగూడ కల్లుగీత సంఘం నూతన కార్యవర్గం

కుషాయిగూడ: కుషాయిగూడ కల్లుగీత సంఘం అధ్యక్షుడిగా పనగట్ల రామరాజ్‌గౌడ్ ఎన్నికయ్యారు. గురువారం జరిగిన సంఘం సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈక్రమంలో కార్యవర్గాన్ని కూడా ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా కాసుల సురేశ్ గౌడ్, ఉపాధ్యక్షుడు బుడంపల్లి వెంకటేశ్ గౌడ్, డైరక్టర్లు పంజాల బాబుగౌడ్, లింగాల సత్యనారాయణ గౌడ్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షుడు రామరాజు గౌడ్ మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు కాసుల రవీందర్ గౌడ్, సంకూరి శ్రీనివాస్ గౌడ్, పులి ఆంజనేయులు గౌడ్, కూరెల్లి అశోక్ గౌడ్, చిత్తుల నర్సింహ గౌడ్, పంజాల ముత్యాలు గౌడ్, సంకూరి చైతన్య గౌడ్, యాదయ్య, అంజయ్య, బాలయ్య పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



కదారి రామయ్య(ఫైల్)

ఉప్పల్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఉప్పల్‌లో బగాయత్‌లోని ఓ అపార్టుమెంట్‌లో నివాసముంటున్న కదారి రామయ్య(70) ఈ నెల 9వ తేదీ రాత్రి అపార్టుమెంట్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో రామయ్య కుమారుడు గురువారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసాడు. కాగా, రామయ్యకు పాక్షిత పక్షవాతం ఉందని తెలిసింది.

లక్ష్మీనగర్ అభివృద్ధికి తోడ్పాటు



షెడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్

కుషాయిగూడ: స్థానికంగా నిత్యం అందుబాటులో ఉంటూ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌లోని లక్ష్మీనగర్ కాలనీలో రూ.23 లక్షలతో అసోసియేషన్ ఆవరణలో నిర్మించిన షెడ్‌ను గురువారం కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తానని, లక్ష్మీనగర్ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డితో పాటు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ప్రధాని పర్యటనను అడ్డుకుంటాం'

మల్లాపూర్: భారత రాజ్యాంగాన్ని మార్చాలని చెప్పిన బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ హెచ్.ఆర్ మోహన్ తెలిపారు. గురువారం నాచారంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేడ్కర్ ఇచ్చిన రాజ్యాంగాన్ని కనుమరుగు చేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. వెంటనే ఎంపీని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ వస్తున్న ప్రధాని మోదీని అడ్డుకుంటామని హెచ్ఆర్ మోహన్ హెచ్చరించారు. కార్యక్రమంలో మోహన్, కుమార్, గద్ద క్రాంతికుమార్, రఘు, ప్రభాకర్ తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అల్వాల్: వెంకటాపురం డివిజన్ బండమీది బస్తీ సుభాష్‌నగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు ఈ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏ–బ్లాక్ అధ్యక్షుడు నిమ్మ అశోక్‌రెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సెక్రటరీ జి.కృష్ణగౌడ్, డివిజన్ ఇన్‌చార్జీ టీవీ.భాస్కర్, మాజీ కౌన్సిలర్ శ్యాంసుందర్, నాయకులు శివకుమార్, రఘునాథ్, శివ, శేఖర్, వెంకటరావు, సాయికుమార్, దశరథ్‌యాదవ్ పాల్గొన్నారు.

శ్మశానవాటికలో వసతుల కల్పనకు వినతి



కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పీరునాయక్

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని సింగం చెరువు తండాలోని శ్మశానవాటికలో వసతులను కల్పించాలని కోరుతూ గురువారం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డికి, జీహెచ్‌ఎంసీ డీఈ రూపకు తండా అధ్యక్షుడు పీరునాయక్ వినతిపత్రం అందజేశారు. బర్నింగ్ ప్లాట్‌ఫామ్, ప్రహరీ, స్నానపు గదులు, బోరు, గేటు లాంటివి ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఇందుకు కార్పొరేటర్, డీఈ సానుకులంగా స్పందించినట్టు పీరునాయక్ తెలిపారు.

మహిళా సమైఖ్య ఆధ్వర్యంలో వేడుకలు

అల్వాల్: వెంకటాపురం, లోతుకుంట మహిళా సమైఖ్య ఆధ్వర్యంలో గురువారం ఇందిరానగర్ కాలనీ కనకరాజు కల్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆటపాటలతో అలరించగా.. విజేతలైన వారికి బహుమతులు అందచేశారు. జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టు అధికారి మదన్‌మోహన్ హాజరై కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రవీణ్, సురేశ్, స్వరూప, బ్యాంకు మేనేజర్లు రంగారెడ్డి, నాగేశ్, నిమ్మ సునీత, మాధవి, భాగ్య, బాలమణి, రత్న, ఉమ, పల్లవి, శైలజ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఆర్డీఓకు వినతి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని సర్వే నంబరు 3లో గల ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను ఆపాలని సీపీఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్ గురువారం ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గతంలో ఇక్కడ నిర్మాణాలు చేపడుతుండగా స్థానిక అధికారులకు ఫిర్యాదు చేయడంతో కూల్చి వేశారని ఈ సందర్భంగా కిషన్ గుర్తుచేశారు. తిరిగి నిర్మాణాలు చేపడుతున్నారని, అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.